www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 27 ఆగస్టు 2023



ఎస్ఐ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలకు వర్షం అడ్డంకి

11వ తేదీకి వాయిదా

ఏలూరు స్పోర్ట్స్:శనివారం జరగాల్సిన ఎస్ఐ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలకు వర్షం ఆటంకంగా మారింది. దీంతో తాత్కాలికంగా పరీక్షలను వాయిదావేశారు. తిరిగి వచ్చేనెల 11వ తేదీ నిర్వహిస్తామని ఏలూరు రేంజ్ డిఐజి అశోక్ కుమార్ తెలిపారు. ఎస్ఐ పోస్టులకు దరఖాస్తు చేసుకుని ప్రాథమిక పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించేందుకు పోలీసు శాఖ రంగం సిద్ధం చేసింది. ఏలూరు రేంజ్ పరిధిలో ఉన్న అభ్యర్థులకు ఈ పరీక్షలు నిర్వహించేందుకు ఏలూరు నగరంలోని పోలీస్ గ్రౌండ్‌ను సిద్ధం చేశారు. ఈ పరీక్షలు ఈనెల 25వ తేదీ నుంచి ప్రారంభమయ్యాయి. అయితే శనివారం వర్షం పడటంతో పరీక్షలు నిర్వహించడం సాధ్యంకాలేదు. దీంతో తాత్కాలికంగా వాయిదావేశారు. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ శనివారం పరీక్షకు హాజరు కావాల్సిన అభ్యర్థులంతా 11వ తేదీ పరీక్షలకు హాజరుకావాలని సూచించారు.

జనాలను కలిసేదెప్పుడు..!



రోజంతా వీడియో కాన్ఫరెన్స్‌లు, సమావేశాల్లోనే అధికారులు

కింది స్థాయి నుంచి పైస్థాయి వరకూ ఇదే పరిస్థితి

సామాన్యులు తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతం

స్పందనలో ఫిర్యాదిస్తేనే స్పందిస్తున్న అధికార యంత్రాంగం

క్షేత్రస్థాయి పర్యటనలకు అధికారులు దూరం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'డెల్టాలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి తమ వీధిలో డ్రెయినేజీ సమస్య ఏర్పడిందని చెప్పుకునేందుకు పంచాయతీకి వెళ్తే కార్యదర్శి మీటింగ్‌కు వెళ్లారంటూ సమాధానం వస్తోంది. అక్కడున్న వారికి సమస్య చెప్పినా కార్యదర్శిని కలవాలనే సమాధానం వస్తోంది. మరోసారి వెళ్తే జూమ్ మీటింగ్‌లో ఉన్నారంటారు. దీంతో విసిగిపోయిన సదరు వ్యక్తికి ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి.'

'మెట్ట ప్రాంతంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి భూమికి సంబంధించిన సమస్యను చెప్పుకునేందుకు వెళ్లినా మండల అధికారులు అందుబాటులో ఉండటం లేదు. జిల్లా కేంద్రానికి వచ్చినా ఏ ఒక్క అధికారీ దొరకని పరిస్థితి. అదేమని అడిగితే సదరు అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో ఉన్నారంటూ సమాధానమే. దీంతో సదరు వ్యక్తి స్పందనలో ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యాడు.'

పైన పేర్కొన్న వారే కాదు.. రెండు జిల్లాల్లోని సామాన్య ప్రజానీకం తమ సమస్యలను చెప్పుకునేందుకు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. సమస్య చెప్పుకునేందుకు వెళ్లిన జనానికి అధికారుల దర్శనమే దొరకడం లేదు. అదేమని అడిగితే ఏ రోజు వెళ్లినా సదరు అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో ఉన్నారనో, జూమ్ మీటింగ్‌లోనో, పై అధికారుల సమావేశంలోనో ఉన్నారంటూ సమాధానమే. దీంతో జనాలు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. అధికారులు అందుబాటులో లేకపోవడంతో చిన్నచిన్న సమస్యలపైనా స్పందనలో ఫిర్యాదు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కిందిస్థాయిలో జరుగుతున్న స్పందనలో ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో జిల్లా కేంద్రానికి రావాల్సి వస్తోంది. భూమి మ్యూటేషన్ సమస్య గురించి మండల కేంద్రంలో తహశీల్దార్‌ను కలుద్దామంటే ఎన్నిరోజులు తిరిగినా దర్శనం దొరకడం లేదని జనం వాపోతున్నారు. సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చాం, జనం తమ సమస్యలపై మండల, జిల్లా కేంద్రాలకు రావాల్సిన అవసరం లేదన్నట్లు ప్రభుత్వం తెగ ఊదరగొట్టింది. సచివాలయానికి వెళ్లి సమస్య మొరపెట్టుకున్నా ఏఒక్క సమస్యా పరిష్కారం కావడం లేదని జనం గగ్గోలు పెడుతున్నారు. పైకి పంపించడం వరకే తమ పని అని, అక్కడ నుంచి సమాధానం వచ్చిన తర్వాతే తాము ఏమైనా చేయగలమని సచివాలయ సిబ్బంది చేతులెత్తేస్తున్నారు. మండలస్థాయి అధికారులు దొరకరు, జిల్లాస్థాయి అధికారులను కలవడం కలవరు అనే భావన జనంలో పెరిగిపోతుంది. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి జనాలను కలవడం దాదాపు కనుమరుగవుతోంది. సమావేశాలతోనే అధికారులు తమ సమయాన్నంతా గడిపేస్తున్నారు. దీంతో సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు క్షేత్రస్థాయికి చేరడంలో తీవ్ర సమస్యలు ఏర్పడుతున్నాయి. భూమికి సంబంధించిన సమస్య వస్తే నెలలు తరబడి అధికారుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి దాపురించింది. దీంతో ప్రభుత్వం, అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో సమయం, సందర్భం లేకుండా సాగిన సమావేశాలపై ప్రతిపక్షంలో ఉన్న వైసిపి తీవ్ర విమర్శలు గుప్పించింది. ఇప్పుడు వైసిపి ప్రభుత్వం అంతకంటే దారుణంగా పరిస్థితిని మార్చేసిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సమావేశాలపై అధికారులు సైతం విసిగిపోతున్న పరిస్థితి కన్పిస్తోంది. సమావేశాలతోనే సమయమంతా సరిపోతే తాము పని ఎప్పుడు చేయాలో తెలియడం లేదంటూ అధికారులే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యలు వినేందుకు అధికారులకు ఖాళీ లేకపోతే ప్రజలు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో ప్రభుత్వం చెబితే బాగుంటుంది. ఒక అధికారిని కలవాలంటే మీటింగ్ అయ్యే వరకూ కనీసంగా రెండు, మూడు గంటలు బయట వేచిచూడాల్సిన పరిస్థితి కొనసాగుతోంది. సమావేశాలు, వీడియోకాన్ఫరెన్స్‌లు, జూమ్ మీటింగ్‌లపై ప్రభుత్వం సరైన విధానం పాటించాలని జనం కోరుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఈ సమస్యను పరిష్కరించాలని అంతా కోరుతున్నారు.

సమస్యలు వింటూ.. ఆప్యాయంగా పలకరిస్తూ..!

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, ముసునూరు

జనం సమస్యలు వింటూ.. అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ఏలూరు జిల్లాలోని నూజివీడు నియోజకవర్గంలో రెండోరోజు శనివారం టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర సాగింది. నూజివీడు మండలం పోతిరెడ్డిపల్లి నుంచి ఉదయం ప్రారంభమైన పాదయాత్ర సింహాద్రిపురం, మండల కేంద్రం ముసునూరు మీదుగా వలసపల్లి వరకూ దాదాపు 17.2 కిలోమీటర్ల మేర సాగింది. ముసునూరు మండలం సింహాద్రిపురం గ్రామంలోకి పాదయాత్ర చేరుకోగానే మహిళలు గజమాలతో స్వాగతం పలికారు. నేలపాటివారికుంట వద్దకు

ముసునూరులో సాగుతున్న లోకేష్ పాదయాత్ర

ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న లోకేష్

చేరేసరికి 2600 కిలోమీటర్లు మైలురాయిని దాటిన సందర్భంగా తెలుగుయువత ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దే రఘుబాబు ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. వేంపాడు కాలువ వద్ద చెక్కపల్లి గ్రామ రైతులు గజమాలతో సత్కరించారు. రాష్ట్ర సగర సంఘం నాయకులు, దళితులు తమ సమస్యలను పరిష్కరించాలంటూ లోకేష్‌కు వినతిపత్రాలు అందించారు. బోర్డు బల్ల సెంటరు వద్ద మానం వంశీ తోడ్పాటుతో వేల్పుచర్ల గ్రామ మహిళలకు కుట్టు మిషన్లను లోకేష్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముద్రబోయిన వెంకటేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. మహిళలు, యువత, వృద్ధులతో లోకేష్ సెల్ఫీ కార్యక్రమం నిర్వహించారు.

రచ్చబండలో జనంతో ముఖాముఖి

ముసునూరులో రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్న లోకేష్ దృష్టికి గ్రామస్తులు డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తం, చింతలపూడి ప్రాజెక్ట్ పూర్తికాక సాగునీరు అందకపోవడం, ఎంఎల్ఎ అవినీతి, సంక్షేమ కార్యక్రమాల రద్దు,



మహిళలతో మాట్లాడుతున్న లోకేష్

ఇసుక కొరత తదితర సమస్యలపై మాట్లాడారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ జగన్ తనది బటన్ ప్రభుత్వం అని పదేపదే చెబుతున్నాడని, ఇప్పుడు ఆ బటన్‌కు పవర్ పోయిందని అన్నారు. అప్పిచ్చే వాడు లేక బటన్ నొక్కినా డబ్బులు పడటం లేదని తెలిపారు. జగన్ ప్రజలపై భారాలు వేసి సంక్షేమం అంటున్నాడని విమర్శించారు. ముసునూరుకు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, కొత్త రోడ్లు వేస్తామని హామీ ఇచ్చారు. జగన్ చేసే సైకో పనులు చూసి సైకో అనడం తప్ప రెచ్చగొట్టే వ్యాఖ్యలు ఏమీ చేయలేదన్నారు. టిడిపి హయాంలో ట్రాక్టర్ ఇసుక రూ.1500 ఉంటే ఇప్పుడు జగన్ పాలనలో రూ.ఐదు వేలు ఉందన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఇసుక, సిమెంట్, ఐరన్ ధరలు తగ్గిస్తామన్నారు. పంచాయతీ పాలనా సమస్యలపై సర్పంచి విజయలక్ష్మి వివరించారు.

పాదయాత్రకు రక్షణ కల్పించాలని ఎస్‌పికి వినతి

లోకేష్ పాదయాత్రకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చూడాలని, రక్షణ కల్పించాలని టిడిపి ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు ఆధ్వర్యంలో నేతలు జిల్లా ఎస్‌పి మేరీప్రశాంతిని శనివారం కలిసి వినతిపత్రం అందించారు. శుక్రవారం వైసిపి శ్రేణులు, టిడిపి మధ్య జరిగిన ఘర్షణపై నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీ మాగంటిబాబు స్థానిక టిడిపి నేత పాకా శ్రీను విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు.

నేడు పాదయాత్ర ఇలా

ఏలూరు జిల్లాలో మూడో రోజు ఆదివారం పాదయాత్ర ఇలా సాగనుంది. ఉదయం పాదయాత్రకు విరామం ప్రకటించారు. సాయంత్రం నాలుగు గంటలకు వలసపల్లి బస నుంచి యాత్ర ప్రారంభం కానుంది. 4.30 గంటలకు వలసపల్లిలో స్థానికులతో సమావేశం, 4.50 గంటలకు చింతలపూడి నియోజకవర్గంలోకి ప్రవేశిస్తోంది. 6.20 గంటలకు ధర్మాజీగూడెంలో స్థానికులతో సమావేశం, 7.50 గంటలకు మట్టంగూడెంలో స్థానికులతో సమావేశం, 8.20 గంటలకు సుందర్రావుపేట స్థానికులతో సమావేశం, 8.50 గంటలకు సుందర్రావుపేట శివార్లలో బస చేయనున్నారు.

ఆహా క్యాంటీన్లతో మహిళల ఆర్థికాభివృద్ధి : ఎలిజా

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

సిఎం జగన్ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాల సంక్షేమ పథకాలతో పాటు ఆహా క్యాంటీన్లు మహిళల ఆర్థిక పురోగతికి దోహదపడతాయని ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా అన్నారు. శనివారం పాత డిఎస్‌పి కార్యాలయ రోడ్డులో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆహా క్యాంటిన్‌ను ఎంఎల్ఎ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెప్మా సభ్యురాలు అన్నపూర్ణ మెప్మా ఆధ్వర్యంలో ఆహా క్యాంటీన్ నిర్వహించడం శుభ పరిణామమన్నారు. వైఎస్ఆర్ ఆసరా పథకం ద్వారా లబ్ధి పొందిన వారు ఇలాంటి ప్రభుత్వ ప్రోత్సాహక వ్యాపారాలతో ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ భవానిప్రసాద్, వైసిపి పట్టణ అధ్యక్షులు పిపిఎన్.చంద్రరావు, సీనియర్ నాయకులు సాగర్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉండాలి

ప్రజాశక్తి - చింతలపూడి

పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని జెడ్‌పి సిఇఒ రవికుమార్ అధికారులను ఆదేశించారు. చింతలపూడి-1 సచివాలయ పరిధిలో సుబ్బరాజు హైస్కూల్‌ను కలెక్టర్ ఆదేశాల మేరకు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను భోజనం నాణ్యతను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజనం రుచిచూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.మురళీకృష్ణ, నగర పంచాయతీ కమిషనర్ ఎస్.రాంబాబు, మండల విద్యాశాఖ అధికారులు గుగులోతు రామారావు, కిరణ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హాస్టళ్లలోని సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏజెన్సీ పరిధిలోని సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం పిడిఎస్‌యు ఆధ్వర్యంలో ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు కాకి నాని మాట్లాడుతూ హాస్టళ్లలో అనేక రకాల సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ విష జ్వరాల బారినపడి ఏజెన్సీ ప్రాంతాల్లోని విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నారని, మరికొంతమంది తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. టైఫాయిడ్, మలేరియా, డెంగీ వంటి విషజ్వరాల బారిన పడుతున్నారని, హాస్టళ్లలో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని నాని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షులు బి.వినోద్ మాట్లాడుతూ బుట్టాయగూడెంలో ఎస్‌టి బాలుర కళాశాల శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు హాస్టల్లో ఉండలేక రాత్రి భోజనం చేసిన తర్వాత రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న డిగ్రీ కళాశాలలో పడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పలుమార్లు ఐటిడిఎ అధికారులకు, ఎంఎల్ఎకు వినతిపత్రాలిచ్చినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మెస్‌ఛార్జీలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు నగర అధ్యక్షులు క్రాంతి, విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రయాన్-3 విజయంలో నూజివీడు విద్యార్థి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

చంద్రయాన్-3 ప్రయోగంలో నూజివీడు పూర్వపు విద్యార్థి పాత్ర ఉండటంతో ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని శ్రీ సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో బిఎస్‌సి విద్యార్థి 24 ఏళ్ల కొంపల్లి శోభన్‌కుమార్ చంద్రయాన్-3 ప్రయోగంలో పాల్గొన్నాడు. చంద్రుడిపై విక్రం ల్యాండర్ సేఫ్ ల్యాండింగ్ ప్రక్రియలో నావిగేషన్ కంట్రోల్ టీములో పనిచేశారు. శనివారం కళాశాల ప్రిన్సిపల్ రవికుమార్, డైరెక్టర్ సాంబశివరావు శోభన్‌ను అభినందించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

సీజనల్ వ్యాధుల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, ఇన్‌ఛార్జి డిప్యూటీ డిఎంహెచ్‌ఒ ఎన్.నాగేశ్వరరావు సూచించారు. శనివారం ఆయన జీలుగుమిల్లి పిహెచ్‌సిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉందని, సిబ్బంది వాటిపై అప్రమత్తం చేయాలని సూచించారు. ఏజెన్సీ ప్రాంతంకావడంతో సిబ్బంది గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతిఒక్కరూ దోమతెరలను వాడాలని ప్రజలకు సూచించారు.

బిజెపి ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి

28 నుంచి సిపిఎం నిరసనల విజయవంతానికి పిలుపు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం అధ్వర్యంలో ఈనెల 28 నుంచి చేపడుతున్న నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి తెలిపారు. శనివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కరపత్రాల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మతోన్మాద మోడీ ప్రభుత్వం అధికధరలు, నిరుద్యోగ సమస్యలను పరిష్కరించడంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా మోడీ పాలనను వ్యతిరేకించకుండా బిజెపికి భజన చేస్తూ ఆ విధానాలనే అత్యుత్సాహంతో అమలు చేస్తుందన్నారు. ఈ భారాలకు వ్యతిరేకంగా, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి, నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని, అధిక ధరలను, కరెంట్ ఛార్జీలు తగ్గించాలని సిపిఎం అధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనుందని, ప్రజలందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం సమరభేరికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు, సిహెచ్.కొండలరావు, ఎన్.అప్పారావు, కె.జయమ్మ, కారం దుర్గ, సోడెమ్మ పాల్గొన్నారు.

కుక్కునూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేకవిధానాలకు నిరసనగా సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీ నుంచి జరిగే సమరభేరిలో ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి పిలుపునిచ్చారు. శనివారం కుక్కునూరు, వేలేరుపాడు మండలాల సిపిఎం మండల కమిటీ సమావేశం పాతదాచారంలో పట్ల లక్ష్మయ్య, కారం వెంకట్రావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎ.రవి మాట్లాడుతూ నిత్యావసర ధరల అదుపులో బిజెపి ఘోరంగా విఫలమైందన్నారు. నిరుపేదలను ఆదుకోవడంలో పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. పోలవరం ప్రాజెక్టుకు నిధులు ఇవ్వకుండా నిర్వాసితులను మోసం చేస్తూ తీరని అన్యాయం చేస్తున్నారని, ఇదే బాటలో రాష్ట్ర ప్రభుత్వం ప్రయాణిస్తూ రాష్ట్ర ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సిపిఎం కుక్కునూరు, వేలేరుపాడు మండలాల కార్యదర్శులు యర్రంశెట్టి నాగేంద్రరావు, ధర్ములా రమేష్, మండల కమిటీ సభ్యులు మడివి దుర్గారావు, యర్నం సాయికిరణ్, పట్ల లక్ష్మయ్య, ప్రకాష్ పాల్గొన్నారు.

చింతలపూడి : కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 28వ తేదీ నుంచి వచ్చేనెల నాలుగో తేదీ వరకూ దేశవ్యాప్తంగా సిపిఎం చేపడుతున్న ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా జిల్లాలో విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్ పిలుపునిచ్చారు. సిపిఎం మండల ముఖ్యకార్యకర్తల సమావేశం పార్టీ నేత ఎస్.సూర్యకుమార్ అధ్యక్షతన ప్రజా సంఘాల కార్యాలయం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆందోళనల్లో భాగంగా ప్రజల వద్దకు వెళ్లి ప్రజావ్యతిరేక విధానాలపై ప్రచురించిన కరపత్రాలను అందించాలన్నారు. దీనికి అందరూ సహకరించాలని కోరారు. అనంతరం ఉద్యమ వివరాలను తెలియజేస్తూ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు రామిశెట్టి సత్యనారాయణ, కె.చంద్రశేఖర్‌రెడ్డి, డి.సత్యనారాయణ, కె.అనురాధ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కలిదిండి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఎం ఆధ్వర్యంలో చేపడుతున్న నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్‌ను కలిదిండిలో ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి శేషపు మహంకాళిరావు, కైకలూరు మండల కార్యదర్శి కురేళ్ల లాజరు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భర్త ఇంటి ముందు భార్య ఆందోళన

వేరే యువతితో సహజీవనం చేస్తున్నాడంటూ ఆవేదన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

తన భర్త వేరే యువతితో సహజీవనం చేస్తూ తనకు అన్యాయం చేస్తున్నాడంటూ ఓ భార్య భర్త ఇంటిముందు ఆందోళనకు దిగిన ఘటన జంగారెడ్డిగూడెంలో శనివారం చోటుచేసుకుంది. తనకూ, తన బిడ్డకూ న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేస్తోంది. బాధితురాలు వివరాలిలా ఉన్నాయి. జంగారెడ్డిగూడేనికి చెందిన పోలవరం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాగరాజుకు జీలుగుమిల్లి మండలం బొత్తప్పగూడేనికి చెందిన వేముల వెంకాయమ్మకు 11 ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి మగ బిడ్డ ఉన్నట్లు తెలిపింది. కొద్దికాలంగా నాగరాజు తనతో సఖ్యతగా ఉండటం లేదని, వేరే యువతితో సహజీవనం చేస్తున్నట్లు వెంకాయమ్మ చెబుతోంది. ఇప్పటి వరకూ తనభర్త ప్రవర్తనలో మార్పు వస్తుందని

కుమారుడితో ఆందోళన చేస్తున్న మహిళ

ఎదురుచూస్తూ కాలం గడిపానని, అయితే ఇటీవల తననూ, బిడ్డనూ పూర్తిగా వదిలించుకునే విధంగా ప్రవర్తించడం ఆందోళన కలిగిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో తనకు న్యాయం చేయాలని నాగరాజు ఇంటి వద్ద నిరసన చేపట్టినట్లు బాధితురాలు వాపోయింది. వెంకాయమ్మకు మద్దతుగా బొత్తప్పగూడెం గ్రామస్తులు నిలిచారు.

'లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్'కు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న వైఎస్ఆర్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్-2023 పురస్కారాలకు ఈనెల 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జెసి లావణ్యవేణి సూచించారు. వివిధ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన, సేవ చేసిన వ్యక్తులు, సంస్థల వివరాలను ఈనెల 28వ తేదీలోగా ఏలూరులోని కలెక్టర్ కార్యాలయానికి నిర్దిష్ట ప్రొఫార్మాలో పొందుపరచి పంపాలన్నారు.

సమీక్షలు.. యాత్రలు..!



ఎన్నికలు మరికొద్ది నెలల్లో జరగనున్న నేపథ్యంలో రెండు జిల్లాల్లో నేతలు జనంబాట పడుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ప్రవేశించిన టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ యువగళం పాదయాత్ర రాజకీయాలను వేడెక్కిస్తోందని చెప్పొచ్చు. వామపక్షాలు ప్రజాసమస్యలపై వివిధ రూపాల్లో ఇప్పటికే ఆందోళనలు కొనసాగిస్తుండగా అధికార పార్టీ వైసిపి మాత్రం నియోజకవర్గాలవారీ మంత్రులు, జిల్లా అధికారుల ఆధ్వర్యాన సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ తమ ప్రజాప్రతినిధులు, నేతల ఆకాంక్షలు నెరవేర్చే ప్రయత్నం చేస్తున్నారు.

ఏలూరు జిల్లాలోకి లోకేష్ యువగళం పాదయాత్ర ప్రవేశించింది. అనూహ్యంగా మొదటి రోజే నూజివీడు నియోజకవర్గం తుక్కులూరులో వైసిపి, టిడిపి శ్రేణుల మధ్య ఘర్షణ చోటుచేసుకోవడం చర్చనీయాంశమైంది. సాధారణంగా రాజకీయపార్టీలు యాత్రలు వంటి కార్యక్రమాలు చేపట్టినప్పుడు ఆయా ప్రాంతాల సమస్యలు తెలుసుకోవడం, తమ పార్టీ విధానాలు చెప్పి, ఆయా సమస్యల పరిష్కారానికి కొన్ని హామీలు ఇవ్వడం సర్వసాధారణం. ఆ తర్వాత ప్రత్యర్థులు ఆ నేతల వ్యాఖ్యలను ఖండించేవారు. ప్రస్తుతం దానికి భిన్నంగా ఒక పార్టీ యాత్ర చేస్తుంటే ప్రత్యర్థి పార్టీ కవ్వింపు చర్యలకు దిగడం షరా మామూలైపోయింది. దీనికితోడు పోలీసులు ముందస్తు జాగ్రత్తలు కొరవడటం సమస్యను జఠిలం చేస్తుందనడంలో అతిశయోక్తి లేదు. తుక్కులూరులో వైసిపి శ్రేణులు తమ పార్టీ జెండా ఊపుతూ కవ్వింపు చర్యలకు పాల్పడటం, టిడిపి యువగళం టీమ్ దీనిపై దూకుడుగా స్పందించడంతో ఘర్షణ చోటుచేసుకుంది. ముందుగానే వైసిపి శ్రేణులను పోలీసులు నిలువరించి ఉంటే ఈ ఘర్షణ చోటుచేసుకునేది కాదని పరిశీలకుల అంచనా. అదే సమయంలో రాజకీయ పార్టీల నేతలు సైతం తమ విధానాలను చెప్పుకుని జనాన్ని ఆకట్టుకుని ఎన్నికల్లో గెలవాలి తప్ప ప్రత్యర్థుల నోరునొక్కి తాము అధికారంలోకి రావాలనుకుంటే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటాయనేది బహిరంగ రహస్యం. ఇప్పటికైనా అధికార పార్టీ కవ్వింపు చర్యలు మాని యాత్రల సందర్భంగా తెరపైకి వస్తున్న అంశాలపై దృష్టి పెట్టి చర్యలు తీసుకుంటే తమకే సానుకూల ఫలితాలు ఉంటాయనేది అందరి భావన. దానికి భిన్నంగా వ్యవహరిస్తే ఇలాంటి ఘర్షణలు పునరావృతమై ప్రభుత్వానికి, ఇటు అధికారులకు చెడ్డ పేరొస్తుందనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

ఇక సిపిఐ బస్సు యాత్ర పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల మీదుగా సాగింది. ఏలూరు, జంగారెడ్డిగూడెంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశం, బహిరంగ సభల్లో పోలవరం నిర్వాసితులు, పోలవరం ప్రాజెక్టు పనులు చర్చనీయాంశమయ్యాయి. 'పోలవరం పోరుకేక' పేరిట సిపిఎం పాదయాత్ర నిర్వహించినప్పటి నుంచి నిర్వాసితుల అంశం తెరపైకి వస్తుందనేది మరోసారి రుజువైంది. ఇతర పక్షాల నేతలు సైతం పోలవరం పనులు వేగవంతం చేయాలనడంతోపాటు దీనికోసం సర్వస్వం వదులుకుంటున్న నిర్వాసితుల సంరక్షణ బాధ్యత పాలకులపై ఉందని నొక్కిచెప్పడమే దీనికి నిదర్శనం. అయితే అధికారపక్షాలైన వైసిపి, బిజెపి ఏలూరులో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశానికి రాలేదు.

సిపిఎం స్థానిక సమస్యలపై తన పోరు కొనసాగిస్తూనే ఉంది. రోడ్లు, భూములు తదితర సమస్యలపై రెండు జిల్లాల్లోనూ తన పోరు సాగిస్తోంది. పాదయాత్రలు, ధర్నాలు, మోటారు సైకిల్ ర్యాలీలు నిర్వహించి అధికారులను కదిలిస్తోంది. దీంతోపాటు ప్రజాసంఘాలు, కార్మిక సంఘాలు సైతం ఆయా కార్మికుల, ప్రజల సమస్యలపై పోరాటాలు సాగిస్తున్నాయి. గత ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేత హోదాలో సిఎం జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ తమదైన శైలిలో ఆందోళనలు నిర్వహిస్తున్నాయి.

మొత్తంగా అటు టిడిపి మహాశక్తి, యువగళం పాదయాత్రలతో టిడిపి జనం వద్దకు వెళ్లే ప్రయత్నం చేస్తుండగా జనసేన స్థానికంగా ఏదోక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ఇటు వామపక్షాలు ప్రజా సమస్యల గొంతుకగా నినదిస్తున్నాయి.

అధికార వైసిపి గడపగడపకూ మన ప్రభుత్వం, జగనన్న సురక్ష పేరిట జనం వద్దకు వెళ్లగా తాజాగా నియోజకవర్గాల సమీక్ష పేరిట అటు ప్రజాప్రతినిధులు, తమ నేతలు, జిల్లా అధికారుల సమక్షంలో సమీక్షలు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలో ఇంకా ప్రధాన సమస్యలు ఏమున్నాయి, ఏం చేయగలం అనేది చర్చించి అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. అయితే ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ సమావేశాలు జరగడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా జిల్లా కేంద్రంలో సమావేశాలు నిర్వహించడం వల్ల ఆయా నియోజకవర్గాల ప్రజలు, ప్రజాసంఘాలు, సంస్థలు అధికారుల దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్లే అవకాశం ఉండటం లేదు. పైగా సమస్య పరిష్కరించినా తమకు పెద్దగా ఓట్లు పడవని గుర్తించిన ప్రాంతాలను పక్కన పెడుతున్నట్లు తెలుస్తోంది. ప్రజాసమస్యల పరిష్కారంలోనూ ఓటుబ్యాంకు రాజకీయాలేమిటీ అని పలువురు పెదవివిరుస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం ఆయా నియోజకవర్గాల కేంద్రాల్లోనే సమీక్షా సమావేశాలు నిర్వహించాలని పలువురు సూచిస్తున్నారు. ఉదయం వినతులు స్వీకరించి, మధ్యాహ్నం నుంచి సమీక్షలు పెడితే ఎంతోకొంత ప్రజా సమస్యల పరిష్కారానికి అవకాశం దక్కుతుందని అంచనా వేస్తున్నారు.

మొత్తంగా అటు యాత్రలు, ఆందోళనలు పేరిట ప్రతిపక్షాలు, ఇటు సమీక్షల పేరిట అధికార వైసిపి నేతల హడావుడితో జిల్లా రాజకీయం వేడెక్కిందనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

-వియస్ఎస్‌వి.ప్రసాద్

నేడు చింతలపూడికి యువగళం పాదయాత్ర

ప్రజాశక్తి - చింతలపూడి

యువగళం పాదయాత్రను విజయవంతం చేయాలని కార్యకర్తలకు, నాయకులకు, అభిమానులకు మాజీ మంత్రి పీతల సుజాత పిలుపునిచ్చారు. లోకేష్ బాబు చేస్తున్న యువగళం పాదయాత్ర ఆదివారం చింతలపూడి నియోజకవర్గంలో ప్రవేశిస్తున్న సందర్భంగా కార్యకర్తలతో, నాయకులతో యువగళం పాదయాత్ర గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువగళం పాదయాత్ర ఇప్పటికే 2,600 కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా లోకేష్ బాబుకి శుభాకాంక్షలు తెలియజేశారు. పాదయాత్రలో లోకేష్‌బాబు ప్రతీ జిల్లాలో ఉన్న సమస్యలను నోట్ చేసుకుని, రాబోయే కాలంలో టిడిపి అధికారంలోకి వచ్చాక ప్రతి సమస్యను పరిష్కరిస్తారని తెలిపారు. చింతలపూడి నియోజకవర్గంలో జరిగే యువగళం పాదయాత్ర విజయవంతం చేయాలని టిడిపి కుటుంబ సభ్యులను కోరారు. ఈ కార్యక్రమంలో బండెల ఆశీర్వాదం, దార వీరేంద్ర, సత్యనారాయణ, రాజారావు, మహాలక్ష్ముడు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటిలో కోతుల బెడద

నూజివీడు రూరల్ : నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో కోతుల బెడద నుంచి తప్పించాలని విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. క్యాంపస్‌లో స్వైరవిహారం చేస్తున్న కోతులు తమ వద్ద ఉన్న తినే పదార్థాలను లాక్కొని వెళ్లిపోతున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. ఈ సమస్యపై అధికారులు చర్యలు తీసుకోవాలని సిబ్బంది, విద్యార్థులు కోరుతున్నారు.

బదిలీ అధ్యాపకులకు సన్మానం

నూజివీడు రూరల్ : పట్టణంలోని ఎంప్లాయిస్ కాలనీలోని శ్రీమేడిపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇటీవల బదిలీపై వెళ్లిన అధ్యాపకులను శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ దుర్గారావు మాట్లాడుతూ ఎంతో నిష్ణాతులైన అధ్యాపకుల బోధనతో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారన్నారు. అధ్యాపకుల సేవలు ఎన్నటికీ మరిచిపోలేనివి, పాత జ్ఞాపకాలను వారు నెమరు వేసుకున్నారు.

జగనన్న కాలనీని సందర్శించిన ఎంఎల్ఎ

30న ప్రారంభోత్సవ ఏర్పాట్లు పర్యవేక్షణ

ఉంగుటూరు : చేబ్రోలులో జగనన్న ఇళ్ల కాలనీ పనులను ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు శుక్రవారం పరిశీలించారు. రాష్ట్రవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో జగనన్న ఇళ్ల ప్రారంభోత్సవం చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి విదితమే. ఈక్రమంలో జిల్లాలోని చేబ్రోలులో జగనన్న కాలనీని ఈనెల 30న ప్రారంభించేందుకు జరుగుతున్న పనుల పురోగతిపై గృహనిర్మాణ, హౌసింగ్ అధికారులతో కలిసి ఎంఎల్ఎ సమీక్షించారు. అంతర్గత రోడ్లు, ప్రధాన రోడ్ల నిర్మాణ పనులు రూ.48 లక్షలతో సత్వరమే పూర్తయ్యేలా ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డిఇ సోమేశ్వరరావు, ఎఇ సురేష్‌బాబు, ఎంపిపి మండల కన్వీనర్ మరడా మంగారావు, మాజీ సర్పంచి కర్తం బుజ్జి, ఎంపిటిసి సభ్యులు మనసాల నాగమణి, రాయి లక్ష్మి, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ సత్తార్ సాహెబ్, ఆకుల రాజ పాల్గొన్నారు.

రోడ్ల దుస్థితిపై టిడిపి నిరసన

ముదినేపల్లి : ముదినేపల్లిలోని గుడ్లవల్లేరు రోడ్డులో రోడ్ల దుస్థితిపై శనివారం టిడిపి నాయకులు తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ రోడ్డులో భారీ గుంతలు ఏర్పడి వాహనదారులకు పాలిట ప్రాణసంకటంగా మారాయి. వర్షాలకు రోడ్డు నీట మునగడంతో గుంతల్లో వర్షపు నీరు చేరింది. దీంతో వాహనదారులకు రోడ్డు కనబడక గుంతల్లో పడి రోజుకు పదుల సంఖ్యలో క్షతగాత్రులుగా మారుతున్నారు. టిడిపి యువ నాయకులు కొడాలి వినోద్ ఆధ్వర్యంలో నీట మునిగిన రోడ్డుపై వల వేసి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ వైసిపి పాలనలో రోడ్లు అధ్వాన్నంగా మారాయన్నారు. నాలుగేళ్లుగా జగన్ రోడ్లను అభివృద్ధి చేయకుండా గాలికి వదిలేశారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వి.కిరణ్, ఎ.శివనాగరాజు, వంతాని సురేష్ పాల్గొన్నారు.

లోకేష్‌పై వైసిపి నేతల ఫిర్యాదు

ద్వారకాతిరుమల : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో రెచ్చగొట్టే వ్యాఖ్యలను నిరసిస్తూ స్థానిక పోలీస్ స్టేషన్‌లో వైసిపి సోషల్ మీడియా కన్వీనర్, కో కన్వీనర్ ఫిర్యాదు చేశారు. ఎన్ని ఎక్కువ కేసులు, రౌడీ షీట్లు ఉంటే వారికి తమ పార్టీ అధికారంలోకి రాగానే నామినేటెడ్ పదవులు పెద్దఎత్తున ఇస్తాం అని నారా లోకేష్ హామీ ఇచ్చియున్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని, గొడవలు, రౌడీయిజం సృష్టించి, సమాజంలో అలజడులు చేసే విధంగా వ్యవహరిస్తున్న తరుణంలో శాంతి భద్రతల దృష్ట్యా టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా లోకేష్‌పై చర్యలు తీసుకోవాలని వైసిపి శ్రేణులు కోరారు. ఈ కార్యక్రమంలో ద్వారకాతిరుమల మండలం వైసిపి సోషల్ మీడియా కన్వీనర్ నిట్ల నాగేశ్వరరావు, కో కన్వీనర్ దాసరి కృష్ణారావు, నాగస్వరం శ్రీనివాసరావు, కోట సునీల్, సచివాలయాల మీడియా కన్వీనర్లు బుసనబోయిన నాగరాజు, అందుగుల రాజేష్, లోపింటి దేవానందరావు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల భవన నిర్మాణం పూర్తి

చింతలపూడి : గురుకుల పాఠశాల నిర్మాణం పూర్తి దశకు చేరిందని ఎంఎల్ఎ ఎలీజా తెలిపారు. సెప్టెంబర్ 5వ తేదీన ప్రారంభిస్తామన్నారు. గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తే వైసిపి ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రత్యేక చొరవ తీసుకుని పూర్తి చేసేలా ఆదేశాలు ఇచ్చారన్నారు. పాఠశాల విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పించడం జరిగిందని తెలిపారు.

ప్రతి ఇంటికీ కుళాయి

ఆగిరిపల్లి : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జల జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని నుగొండపల్లి, పోతవరప్పాడు గ్రామాలను హర్‌ఘర్ జల్ గ్రామాలుగా గ్రామ సభలో సర్పంచులు కలిదిండి మల్లీశ్వరి, తోటకూర సత్యనారాయణ ప్రకటించారు. తమ గ్రామాల్లో ప్రతీ ఇంటికీ నీటి కుళాయిలు వున్నట్లుగా వారు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సిహెచ్.పుల్లారావు, గ్రామ నీరు, పారిశుధ్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ఆర్‌టిసి బస్సు - లారీ ఢీ

20 మందికి గాయాలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పల్లె వెలుగు బస్సు లారీని ఢీ కొన్న ప్రమాదంలో సుమారు 20 మంది ప్రయాణికులకు గాయాలైన సంఘటన కొయ్యలగూడెం మండలం బయ్యనగూడెం శివారు పులివాగు వద్ద చోటుచేసుకుంది. శనివారం జంగారెడ్డిగూడెం నుంచి తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం పోతవరం గ్రామానికి 53 మంది ప్రయాణికులతో ఆర్‌టిసి పల్లె వెలుగు బస్సు బయలుదేరింది. కొయ్యలగూడెం మండలం బయ్యనగూడెం శివారు శివాలయం వద్ద రహదారిపై నిర్మాణంలో ఉన్న కల్వర్టు వద్ద ఎదురుగా వస్తున్న లారీ బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయాలైన సుమారు 20 మంది ప్రయాణికులను బయ్యనగూడెం పిహెచ్‌సిలో ప్రాథమిక చికిత్సను అందించారు. అనంతరం కొయ్యలగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో మరో 12 మందికి గాయాలు ఉండటంతో జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎవరికీ ప్రాణహాని జరుగక పోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదంపై కొయ్యలగూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అబ్బాయి పుట్టలేదని..

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

తుక్కులూరు గ్రామంలో వారసుడు జన్మించలేదని, ఆడపిల్లలే పుట్టారని భార్యను భర్త వరకట్న వేధింపులకు గురి చేస్తున్నాడు. గ్రామానికి చెందిన షేక్ సల్మా(34) భర్త ఈసా(42) నిత్యం మద్యం సేవించి విచక్షణారహితంగా భార్యపై దాడి చేసి, వరకట్న వేధింపులకు గురి చేస్తున్నారని సల్మా బంధువు శనివారం తెలిపారు. దాడిలో గాయపడిన సల్మా నూజివీడు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. జరిగిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్టాండ్ గోడను ఢీ కొన్న ఆర్‌టిసి బస్సు

జంగారెడ్డిగూడెం : ఆర్‌టిసి బస్టాండ్ ప్లాట్‌ఫామ్ వద్ద ఆర్‌టిసి బస్సు గోడను ఢీ కొన్న సంఘటన శనివారం జరిగింది. ఆ సమయంలో ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ప్లాట్ ఫాం 9 వద్ద ఆగవలసిన పల్లెవెలుగు బస్సు అదుపు తప్పి ఎదురుగా ఉన్న పోర్ట్ వాల్‌ను ఢీ కొట్టింది. దీనిపై ఆర్‌టిసి డిపో మేనేజర్ గంగాధరావు వివరణ కోరగా బస్సు ఢీ కొని గోడ కూలడం వల్ల ఎవరికీ హాని జరగలేదని తెలిపారు. అలాగే బస్సు స్వల్ప మరమ్మత్తుకు గురైందని తెలిపారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

మానవతా మూర్తి 'మదర్ థెరిస్సా'

ఘనంగా 113వ జయంతి

ఏలూరు అర్బన్‌లో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో మదర్ థెరిస్సా జయంతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా శనివారం జిల్లా రెడ్‌క్రాస్ కార్యాలయంలోని మదర్ థెరిస్సా విగ్రహానికి రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి కృష్ణారెడ్డి, ఏలూరు యూనిట్ మానవత ఛైర్మన్ అడుసుమిల్లి నిర్మల, ప్రెసిడెంట్ మేతర అజయ్ బాబు, లయన్స్ క్లబ్ జోనల్ ఛైర్మన్ శ్రీనివాస్, రోటరీక్లబ్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి కృష్ణారెడ్డి మాట్లాడుతూ నేటికీ అనేక స్వచ్ఛంద సేవా సంస్థలు ఏర్పడ్డాయి అంటే దానికి ముఖ్య కారణం భారతరత్న మదర్ థెరిస్సా చేసిన సేవలను స్ఫూర్తిగా తీసుకోవడమేనని తెలిపారు. మానవత ఏలూరు మండల యూనిట్ ఛైర్మన్ అడుసుమిల్లి నిర్మల మాట్లాడుతూ నేడు అనేకమంది సహాయ కార్యక్రమాలు చేస్తున్నారంటే దానికి కారణం మదర్ థెరిస్సా అని, మదర్ థెరిస్సా సేవా మార్గంలో, మానవత సంస్థ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ధన సహాయం చేయడం, అనాథ పిల్లలకు ఉచిత భోజనం పంపిణీ, పేద కుటుంబాలను ఆదుకోవడం, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం వంటి అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. అనంతరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని రోగులకు రొట్టెలు, పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.బెన్ని, మానవత సభ్యులు అడుసుమిల్లి నిర్మల, మేత అజయ్ బాబు, లైన్స్ క్లబ్ సభ్యులు శ్రీనివాస్, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఏలూరులో మాట్లాడుతున్న గుడిపాటి నరసింహారావు..

చింతలపూడి : 'మానవసేవే - మాధవసేవ' అని చాటి చెప్పిన మదర్ థెరిస్సాను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని చింతలపూడి గైనకాలజిస్ట్ లిబర్టియా దేవి తెలిపారు. చింతలపూడి పట్టణంలో మదర్ థెరిస్సా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు తూము విజయకుమార్ ఆధ్వర్యంలో మానవతా మూర్తి, నోబుల్ శాంతి అవార్డు గ్రహీత, భారతరత్న మదర్ థెరిస్సా 113వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఆమె విగ్రహానికి నర్సింగ్ సూపరింటెండెంట్ సుజాతమ్మతో కలసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం షైమ్ ఏరియాలోని రోగుల వద్ద మదర్ థెరిస్సా చేసిన సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మెడికల్ డిపార్ట్‌మెంట్ అశోక్ బాబు, సురేంద్ర, సింగంశెట్టి సూర్యకుమార్, రామిసెట్టి సత్యనారాయణ, కొతపుడి శేషగిరిరావు, తాడి అప్పారావు, మన్యం సత్యకుమార్, ఆర్వేటి అప్పారావు, గండం శ్రీను, తొర్లపాటి బాబు, అజాద్, అద్దంకి దాస్ పాల్గొన్నారు.

టి. నరసాపురం : సేవే లక్ష్యంగా పనిచేసి ప్రజల మనసులను గెలుచుకున్న విశ్వమాత 'మదర్ థెరిస్సా' అని మండల వైద్యాధికారి జె.కల్యాణ రాణి తెలిపారు. స్థానిక పిహెచ్‌సిలో విశ్వమాత, భారతరత్న, పద్మశ్రీ, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మదర్ థెరిస్సా 113వ జయంతి వేడుకలు విజన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ పురం శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల వైద్యాధికారి జె.కల్యాణరాణి థెరిస్సా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'ప్రార్థించే పెదవుల కన్నా సహాయం చేసే చేతులు మిన్న' అని పలువురికి స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. పాఠశాల కరస్పాండెంట్ పురం శ్రీనివాస్ మాట్లాడుతూ భారతదేశంలో అత్యున్నత పురస్కారమైన భారతరత్న, ప్రపంచంలో అత్యున్నత పురస్కారమైన నోబెల్ శాంతి బహుమతులను అందుకున్న గొప్ప మహిళ అన్నారు. ఆమెను ప్రతిఒక్కరూ ముఖ్యంగా విద్యార్థులు అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పేదలకు, వృద్ధులకు సేవ చేయడం బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 'విశ్వమాత మదర్ థెరిస్సా' అనే అంశంపై విద్యార్థులు చక్కగా వివరించారు. తెలుగు ఉపాధ్యాయిని టి.అరుణ పాడిన ఆదర్శ అమ్మ థెరిస్సా పాట అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ఫణీంద్ర కుమార్, మండల ఆరోగ్య శాఖ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయినులు కె.మహాలక్ష్మి, జి.వరలక్ష్మి, బి.పుష్పావతి, జి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా ఉచిత వైద్యశిబిరం

ఉంగుటూరు : మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా శనివారం నారాయణపురంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. అనంతరం చేబ్రోలు పిహెచ్‌సిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్ర చిన్నారులకు పండ్లు అందజేశారు. నారాయణపురం ఎంపిటిసి సభ్యులు బండారు నాగరాజు, తాడేపల్లిగూడెం వైష్ణవి ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ పెనుగొండ బాలకృష్ణ సంయుక్త ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మండల కన్వీనర్ మరడ మంగారావు, నారాయణపురం ఉపసర్పంచి అడపా శ్రీనివాసరావు, వార్డు సభ్యులు నేదూరి గంగాధరరావు, వైసిపి జిల్లా కార్యదర్శి పుప్పాల గోపీ, మానవత మండల అధ్యక్షుడు గంజి రవికుమార్, ఎంపిటిసి సభ్యురాలు అరివెల్లి మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు : స్థానిక భారతి విద్యానికేతన్ స్కూల్‌లో మదర్ థెరిస్సా 113వ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పశ్చిమగోదావరి జిల్లా గోపాలపురం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ డాక్టర్ కొండేటి మెర్సీ మదర్ థెరిస్సా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మదర్ థెరిస్సా సమాజ సేవ చేసి ఎంతో మంది అనాథలను అక్కున చేర్చుకొన్నారని కొనియాడారు. విద్యార్థులు పాఠశాల దశ నుంచే సమాజ సేవ చెయ్యడం అలవాటు చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కె.శౌరి, కరెస్పాండెంట్ కె.విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కైకలూరు : టిడిపి అధ్యక్షులు పెన్మెత్స త్రినాథ్ రాజు ఆధ్వర్యంలో శనివారం విశ్వమాత, భారత రత్న మదర్ థెరిస్సా 113వ జయంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి కమ్మిలి విఠల్‌రావు, రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి పూల రామచంద్రరావు, జిల్లా టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి పోలవరపు లక్ష్మీ రాణి పాల్గొన్నారు.

పోలవరం : మాతృమూర్తి మదర్ థెరిస్సా జయంతి వేడుకలు పోలవరంలో ఘనంగా నిర్వహించారు. పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మదర్ థెరిస్సా విగ్రహానికి, మెయిన్ సెంటర్‌లో మదర్ థెరిస్సా చిత్రపటానికి, మదర్ థెరిస్సా సేవా సంఘం యువకుల ఆధ్వర్యంలో, జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయులతో కలిసి మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు అందించారు. ఈ సందర్భంగా మదర్ థెరిస్సా సేవా సంఘం సభ్యులు మాట్లాడుతూ మదర్ థెరిస్సా చేసిన సేవలు ఏ తరానికైనా స్ఫూర్తి నింపాలన్నారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ ఉపాధ్యాయులు, మదర్ థెరిస్సా సేవా సంఘం, షేక్ షాహెన్‌షా బాషా పాల్గొన్నారు.

ఏలూరు : పేదలకు సేవ చేసిన మదర్ థెరిస్సా ఆదర్శమూర్తి అని ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు తెలిపారు. పవర్ పేటలోని అన్నే భవనం, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రంలో భారతరత్న మదర్ థెరిస్సా 113వ జయంతిని కంప్యూటర్ శిక్షణ కేంద్రం విద్యార్థులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో నిర్వహించారు. తొలుత మదర్ థెరిస్సా చిత్రపటానికి కంప్యూటర్ శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ ఎం.లక్ష్మి పూలమాల వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ 1910 ఆగస్ట్ 26వ తేదీన అల్బేనియా దేశంలో జన్మించిన మదర్ థెరిస్సా 1950లో కలకత్తాలో చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి, 45 సంవత్సరాల పాటు పేదలకు, కుష్టి వ్యాధిగ్రస్తులకు వైద్య సేవలు అందించడంలో ఎనలేని సేవలు చేశారని తెలిపారు. అల్బేనియా దేశం నుంచి భారతదేశానికి వచ్చినా భారతదేశ పౌరురాలుగా జీవించారన్నారు. 1979లో నోబెల్ బహుమతి గ్రహీత, కేంద్ర ప్రభుత్వం థెరిస్సా సేవలను గుర్తించి 1980లో భారతరత్న అందించి గౌరవించిందని తెలిపారు. 1997 సెప్టెంబర్ 5వ తేదీన మరణించారన్నారు. 97 సంవత్సరాల జీవిత కాలంలో థెరిస్సా లక్షల మందికి సేవా కార్యక్రమాల ద్వారా ప్రేరణ కలిగించేలా కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కె.పద్మావతి, ఎం.సాయి, జి.గణేష్, యు.దొరబాబు, జె.సునీత పాల్గొన్నారు.

చేబ్రోలు పిహెచ్‌సిలో రోగులకు పండ్లు పంపిణీ...

అంగన్‌వాడీ కేంద్రాల బాట పట్టిన అధికారులు

రక్తహీనత చిన్నారుల గుర్తింపు కోసం తనిఖీ

ప్రజాశక్తి - ఉంగుటూరు

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణీ, కిశోర బాలికలు, బాలింతల్లో రక్తహీనతను గుర్తించేందుకు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాలతో అధికారులు శనివారం మండలంలో పర్యటించారు. జిల్లా వ్యవసాయ అధికారి రామకృష్ణ గుళ్లపాడు, నాచుగుంట, యర్రమళ్ల, కొత్తగూడెంలో, ఇంచార్జి ఎంపిడిఒ, ఐసిడిఎస్ అధికారులు ఉంగుటూరులో అన్ని కేంద్రాలు, తహశీల్దార్ ఎవి రమణారావు కైకరంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో పర్యటించి తల్లులు, గర్భవతులు, చిన్నారుల్లో వయస్సుకు తగ్గ బరువు లేనివారు, వయస్సుకు మించి అధిక బరువు ఉన్నవారి వివరాలను తనిఖీలు చేసి, వివరాలను జిల్లా కలెక్టరుకు అందజేయనున్నారు. హెల్త్, ఐసిడిఎస్ పర్యవేక్షకులు, ఆశా కార్యకర్తలు ఆయా అధికారుల వెంట పాల్గొన్నారు.

మండవల్లి : అంగన్‌వాడీ చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించి, చిన్నారుల మానసిక, శారీరక ఎదుగుదలకు కృషి చేయాలని ఎంపిడిఒ వెంకటరమణ తెలిపారు. మండవల్లిలోని అంగన్‌వాడీ సెంటర్లను ఆయన తనిఖీ చేసి బాలింతలు, గర్భిణులకు అందుతున్న పౌష్టికాహార వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌష్టికాహార పంపిణీలో అవకతవకలు లేకుండా, సక్రమంగా లబ్ధిదారులకు అందించాలని తెలిపారు. అంగన్‌వాడీలోని చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు పాటలు, ఆటలు, మంచి అలవాట్లు నేర్పాలి అన్నారు. రుచికరమైన పౌష్టికాహారాన్ని వండి పెట్టాలని తెలిపారు. అనంతరం రిజిస్టర్లను తనిఖీ చేశారు.

పోలవరం : జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు గూటాల-1 అంగన్‌వాడీ కేంద్రాన్ని తహశీల్దార్ బి.సుమతి శనివారం పరిశీలించారు. ఎఎన్ఎంలు, అంగన్‌వాడీలతో పాటు సమావేశం నిర్వహించి, పాఠశాలలో పౌష్టికాహారం సక్రమంగా అందుతుందా లేదా అని ఆరా తీశారు. బరువు తక్కువగా ఉన్న పిల్లలను పరీక్షించారు. తహశీల్దార్ వెంట డిటి ప్రసాద్ రావు ఉన్నారు.

చింతలపూడి : ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ప్రతి గ్రామంలో ఇంటింటికీ వైద్య సదుపాయం అందుబాటులోకి వచ్చిందని, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.శర్మ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం మండలంలోని ప్రగడవరం గ్రామంలోని సచివాలయాన్ని సందర్శించారు. గ్రామంలో అమలవుతున్న 'ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్' ప్రభుత్వం సూచించిన నిబంధనలకు అనుగుణంగా జరుగుతుందని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విధానం ద్వారా నెలలో రెండు పర్యాయములు ప్రతీ గ్రామాన్ని వైద్యులు సందర్శించి, ఉచితంగా పరీక్షలు, వైద్య సేవలు, మందులు అందించడం జరుగుతుందన్నారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార లోపం ఉన్న పిల్లలకు అందుతున్న సేవలను ఆయన తనిఖీ చేశారు. ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి ప్రభుత్వం రక్తహీనతకు అందిస్తున్న మాత్రలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని నిశితంగా పరిశీలించారు. ఆమె వెంట కె.గోకవరం వైద్యాధికారి డాక్టర్ ఆర్.కృష్ణ కిషోర్, ఆరోగ్య విస్తరణ అధికారి అక్బర్ హుస్సేన్, ఎంఎల్‌హెచ్ పి.భరత్ కుమార్, ఆశాలు పాల్గొన్నారు.

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగు : ఎంఎల్ఎ బాలరాజు

ప్రజాశక్తి - టి.నరసాపురం

సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టి అమలు చేస్తున్న నవరత్నాల పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు తెలిపారు. మండలంలోని మక్కినవారిగూడెం పంచాయతీలో శనివారం నిర్వహించిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొన్న బాలరాజు ఇంటింటికి తిరుగుతూ 1, 2, సున్నపురాళ్లపల్లి, మర్రిగూడెం గ్రామాలలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు అసంపూర్తిగా వున్న సిసి రోడ్లు పూర్తి చేయాలని, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని, వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేసి ప్రతి ఇంటికీ పంపు కనెక్షన్ ఏర్పాటు చేయాలని, పలు సమస్యలు ఎంఎల్ఎ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన బాలరాజు మండల పరిషత్ నుంచి రూ.10 లక్షలతో స్థానిక సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పారదర్శకంగా సంక్షేమ అభివృద్ధి పథకాలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. వాలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారునికి అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి రైతు విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షులు వాసిరెడ్డి మధు పాల్గొన్నారు.

'బాలబాలికల పర్యవేక్షణ తల్లిదండ్రులదే'

కైకలూరు : బాల బాలికల పర్యవేక్షణ బాధ్యత తల్లిదండ్రులదేనని కైకలూరు జూనియర్ సివిల్ జడ్జి బి.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాడె వీర వెంకట సత్యనారాయణ అధ్యక్షతన న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ తమ పిల్లలకు తల్లిదండ్రులు తగు సమయం కేటాయించి, వారిని మంచి మార్గంలో నడిపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ రాజు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్‌ఒసి అందజేత

పోలవరం : నిరుపేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి నిలుస్తోందని పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు తెలిపారు. పోలవరం మండలం గూటాల గ్రామానికి చెందిన కట్టూరి దుర్గ గుండె సంబంధిత వ్యాధి చికిత్స నిమిత్తం హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్లో చికిత్స పొందుతుంది. ఈ విషయాన్ని పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు దృష్టికి తీసుకురాగా మెరుగైన వైద్యం కోసం సిఎంఆర్ఎఫ్ ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.7 లక్షల ఎల్‌ఒసి మంజూరు చేయించి, ఎల్‌ఒసి పత్రాన్ని అందజేశారు.

నేత్ర విజ్ఞాన సంస్థ సేవలు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - భీమడోలు

సేవా దృక్పథంతో గ్రామీణ ప్రాంతాలకు నేత్ర వైద్య ఉచిత సేవలను అందించేందుకు ముందుకు వచ్చిన ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ సేవలను వినియోగించుకోవాలని స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు చెరుకూరి ధర్మయ్య యువజన సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి.మాగ్ సింగ్ కోరారు. భీమడోలు కేంద్రంగా ఏర్పాటు చేసిన సంస్థ రెండవ వార్షికోత్సవ వేడుకలను భీమడోలులో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాస్పిటల్‌తో పాటు, ప్రముఖ వైద్యులు డాక్టర్ భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భీమడోలు కేంద్ర నిర్వాహకులు అక్బర్ మాట్లాడుతూ తమ సంస్థ ఏలూరు జిల్లాలోని 15 గ్రామీణ ప్రాంతాలలో ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, సేవలను అందిస్తున్నారన్నారు. దీనిలో భాగంగా మెరుగైన చికిత్స అవసరమైనవారికి ఆకివీడు, విజయవాడ, హైదరాబాద్, ఇతర ప్రాంతాలలోని సంస్థకు చెందిన ఉన్నత స్థాయి వైద్యశాలల్లో ఉచితంగా వైద్య సేవలను, అవసరమైన పరికరాలను అందజేస్తున్నారని, సదరు వైద్యశాలలో సాధారణ నేత్ర వైద్యం నుండి ఉన్నత స్థాయికి చెందిన సుమారు 20 రకాల వైద్య సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. భీమడోలు కేంద్రం ద్వారా గత సంవత్సరం 5,800 మందికి వైద్య పరీక్షలను నిర్వహించగా, 1,100 మందికి మెరుగైన కంటి చూపు కోసం కళ్లజోళ్లను అందజేశామన్నారు. 380 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమై గుర్తించామన్నారు. వీరిలో 200 మందికి శస్త్ర చికిత్సలు చేయించామని, ఆరోగ్యవంతులుగా కొనసాగుతున్నారని తెలిపారు. ఇదే క్రమంలో మరింత మెరుగైన వైద్య సేవల కోసం కంటి వైద్య సలహాలు ఇచ్చేందుకు టెలి చికిత్సను ప్రవేశపెట్టినట్లు తెలియజేశారు. మారుమూల ప్రాంతాల వారికి ఈ తరహా సేవలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి ప్రముఖులు రామకృష్ణ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A. 156/2021
O.S. 201/2015

Between:
శ్రీ దల్లి దుర్గారావు, S/o. గురువులు, హిందు, 50 సం॥లు, వ్యవసాయం, డోరు నెం. 11-22, లక్కవరం, జంగారెడ్డిగూడెం మండలం, ఏలూరు జిల్లా, JRG JCJC.
-పిటీషనరు/వాది

Vs

1. శ్రీమతి మతకల ఈస్టరమ్మ, W/o. పెంచలయ్య, హిందు, స్త్రీ, గృహిణి, 48 సం॥లు, డోరు నెం. 11-136, బి.సి.కాలనీ, R/o. లక్కవరం, జంగారెడ్డిగూడెం మండలం, ఏలూరు జిల్లా.
2. శ్రీ మతకల పెంచలయ్య, S/o. నరసయ్య, హిందు, 50 సం॥లు, డోరు నెం. 11-136, R/o. లక్కవరం, జంగారెడ్డిగూడెం మండలం, ఏలూరు జిల్లా.
3. శ్రీ మతకల దావీదు, S/o. పెంచలయ్య, హిందు, 25 సం॥లు, డోరు నెం. 11-136, R/o. లక్కవరం, జంగారెడ్డిగూడెం మండలం, ఏలూరు జిల్లా.

-రెస్పాండెంట్లు/ ప్రతివాదులు

పై నెంబరు పిటీషను గ్రంధములో పిటీషనరు/ వాది అయిన దల్లి దుర్గారావు దాఖలు చేసుకొనిన I.A. 156/2021 in O.S. 201/2015 to enlarge the time for depositing the balance sale consideration amount కొరకు దాఖలు చేసినది అయివుంది. సదరు పిటీషనుపై మీకు ఎన్నిమార్లు కోర్టు ద్వారాను మరియు పోస్టు ద్వారాను నోటీసులు పంపించినప్పటికీ వాటినీ అందుకొనకుండా ఉద్దేశపూర్వకముగా Avoid చేయుచున్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం Substitute Service పేపరు ప్రకటన ద్వారా R1 to R3 లకు తెలియపరచడమైనది. పై పిటీషనుపై మీ యొక్క అభ్యంతరాలను ది. **05-09-2023వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరు అయి మీ యొక్క ఆక్షేపణలు తెలియపరచుకొనవలెను. లేని యెడల పిటీషను మీ పరోక్షం తీర్మానించబడును.

ఎన్.వి.సుబ్బారావు, అడ్వకేట్
కొవ్వూరు-534350
సెల్: 9440330449

'ఎస్‌సి వర్గీకరణే ప్రధాన ఎజెండా'

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

ఎస్‌సి వర్గీకరణే ప్రధాన ఎజెండాగా అవిశ్రాంత పోరాటం చేస్తున్నట్లు ఎపి ఎంఆర్‌పిఎస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కలపాల సురేష్ బాబు తెలిపారు. నూజివీడు ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో ఆయన శనివారం స్థానిక నేతలతో మాట్లాడుతూ సెప్టెంబర్ 14వ తేదీన ప్రాంతీయ చైతన్య సదస్సు విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం నూతన కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతిఒక్కరూ సెప్టెంబర్ 14వ తేదీన జరగబోయే సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

యువగళం పాదయాత్రకు తరలిన టిడిపి నేతలు

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని చనుబండ గ్రామం నుంచి జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, చాట్రాయి నుంచి జిల్లా టిడిపి అధికార ప్రతినిధి మండపాటి బసవా రెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు మరిడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మండలం నుంచి వేలాదిగా పాదయాత్రకు శనివారం తరలి వెళ్లారు. నూజివీడు నియోజకవర్గం ముసునూరులో జరుగుతున్న యువగళం పాదయాత్రలో పాల్గొని, టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా లోకేష్‌కు అండగా నిలబడదాం, పాదయాత్రలో పాల్గొన్నారు.

వివాహానికి గోల్డ్ కాయిన్ అందజేత

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని జంగంగూడెం గ్రామానికి చెందిన తాతినేని శారద కుమార్తె పుష్ప(22) వివాహం సందర్భంగా శనివారం కృష్ణా మిల్క్ యూనియన్ ఆమెకు రూ.20వేల విలువైన గోల్డ్ కాయిన్ అందజేసింది. ఈ సందర్భంగా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ శారద కుటుంబం 'కళ్యాణమస్తు' పథకానికి అర్హులైనందున గోల్డ్ కాయిన్ అందజేశామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ జంక్షన్ పాల శీతల కేంద్రం మేనేజర్ కిలారి కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

In The Court Of The Ist Additional Junior Civil Judge Bhimavaram
O.S.No. 86/2022

Plaintiff: Hasibul Malik
Defendant: Killada Siva Sankar
Defendant Address:
Killada Siva Sankar, S/o. Subrahmanyam, R/o. D.No. 24-9-3, Ram Lakshan Bazar, Bhimavaram, West Godavari District.

పై నెంబరు దావాలో ప్రతివాదికి దావా సమన్లు కోర్టు ద్వారా, పోస్టు ద్వారా ఎన్ని పర్యాయములు పంపించినప్పటికీ ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనకుండా నిరాకరించినందున, సదరు ప్రతివాదికి ఈ పేపరు పబ్లికేషన్ ద్వారా దావా సమన్లు పంపించుటకు పై కోర్టు వారు ఆర్డరు వేసినారు. సదరు దావా ది. **11-09-2023 సం॥రం తేదీన ఉదయం గం॥ 10:30 ని॥ లగాయితు పై కోర్టు వారి ఎదుట** స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరై **ఆక్షేపణలు తెలుపుకొనవలెను.** లేని ఎడల ప్రతివాది పరోక్షమున ఈ దావా తీర్మానించబడును.

JOSEPH EATHAKOTA
Advocate, Bhimavaram.
Cell: 94401 15975

__వేలం నిమిత్తం బహిరంగ ప్రకటన__

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

F.D.I.A.3/2023 in O.S.159/2005

బిట్వీన్:
సత్తి శ్రీనివాసరెడ్డి వారు **...పిటిషనరు /వాది**
మరియు
ద్వారపూడి నాగిరెడ్డి వగైరా
...ప్రతివాదులు /రెస్పాండెంట్లు

పై నెంబరు దావా గ్రంథములో మీపై అనగా 1) ద్వారంపూడి నాగిరెడ్డి, తండ్రి: సత్యనారాయణ రెడ్డి, డో.నెం. 10-78, పెంటపాడు మరియు 2) కర్రి నాగిరెడ్డి, తండ్రి: సత్యనారాయణ రెడ్డి, పోస్టు బేసిక్ స్కూల్ దగ్గర, పెంటపాడు మరియు 3) చింతా పావని, భర్త: చింతా శివారెడ్డి, రెడ్డి రామాలయం దగ్గర, పసలపూడి అను వారలపై సత్తి శ్రీనివాసరెడ్డి గారు దావా వేసి ప్రిలిమినరీ డిక్రీ పొందియున్నారు. శ్రీ కోర్టు వారు షెడ్యుల్ దాఖల ఆస్తిని పై కోర్టులో వేలం వేయుటకు **ది. 25-09-2023 తేది ఉదయం 10॥30 ని॥ల లగయితు వేలం వేసి డిక్రీ బాకీ వసూలు చేయుటకు కోర్టు వారు నిర్ణయించి యున్నారు.** షెడ్యూలు ఆస్థిని కావలసిన వారు కోర్టులో వేలంపాట యందు పాల్గొని కోర్టు వారు షరతుల ప్రకారం షెడ్యులు ఆస్తిని వేలంలో కొనుగోలు చేయుటకు వేలంలో పాల్గొనుటకు ఈ బహిరంగ ప్రకటన ద్వారా ప్రకటించడమైనది. కావున వేలంలో పాల్గొనదలసిన వారు ది.25-09-2023 తేది ఉదయం 10॥30 ని॥లకు పై కోర్టు ఎదుట హాజరు పై వేలంలో పాల్గొనవచ్చును. ఇ.సి. లావాదేవీలు ఏమియు లేదు.

__షెడ్యూలు ఆస్తి వివరం__

__ఐటమ్ 1:__ పశ్చిమ గోదావరి జిల్లా, పెంటపాడు మండలం, పెంటపాడు సబ్ రిజిస్ట్రార్‌లోని పెంటపాడు గ్రామం తాలూకు అసెస్మెంటు నెం. 1025లో డోర్ నెం. 10-62లో తూర్పు వైపు గల రెండు ఐటమ్స్ 89-3 చ॥గ॥ అందలి తాటి ఆకుల ఇల్లుకు హద్దులు:
__తూర్పు:__ కర్రి సుబ్బిరెడ్డి గారి స్థలం (ప్రస్తుతం వెంకటరెడ్డి) ***__దక్షిణం:__*** మల్లిడి సుబ్బిరెడ్డి గారి స్థలం. ***__పడమర:__*** మాడెం నారాయనమ్మ గారి ఇల్లు. ***__ఉత్తరం:__*** రాజ వీధి. ఈ హద్దుల మధ్య 56-4 చ॥గ స్థలంలో తాటియాకుల ఇల్లు.

__ఐటమ్ 2:__ పశ్చిమ గోదావరి జిల్లా, పెంటపాడు మండలం, పెంటపాడు సబ్ రిజిస్ట్రార్లోని పెంటపాడు గ్రామ తాలూకు అసెస్మెంటు నెం. 1205లో డోర్ నెం. 10-62లో తూర్పు వైపు గల రెండు ఐటముల స్థలము మరియు తాటియాకుల ఇల్లు 89-3 చ॥గ॥ ఆస్తికి హద్దులు:
__తూర్పు:__ మాడెం నారాయణమ్మ గారి స్థలం. ***__దక్షిణం:__*** మల్లిడి సుబ్బిరెడ్డి గారి స్థలం. ***__పడమర:__*** వెలగల రామిరెడ్డి గారి స్థలం. ***__ఉత్తరం:__*** రాజవీధి.
ఈ హద్దుల మధ్య 32-3 చ॥గ స్థలం మరియు తాటియాకుల ఇల్లు, రెండు ప్రతులు వెరసి 89-3 చ॥గ॥లు మొత్తము అందలి విద్యుత్ నీరు, నిధి నిక్షేపాలు, చెట్లు, దారి మార్గము వగైరా యావత్తుతో వాది గారి విలువ రెండులక్షలు.

అడ్వకేట్స్
గంగిరెడ్ల సాయి కృష్ణ ప్రసాద్
98483 77977
ముత్తా రామారావు
94411 71612
తాడేపల్లిగూడెం.

తాడేపల్లిగూడెం,
23-8-23.